

# పుస్తక పరిచయం







**సమకాలీన** తెలుగు రచయిత్రులలో ఒక ప్రత్యేకమైన శైలిని అలవరచుకుని సీరియస్ కథలనూ, హాస్యకథలనూ కూడా జనరంజకంగా వ్రాస్తున్న రచయిత్రి జి.ఎస్.లక్ష్మిగారు. ఏదివ్రాసినా ఒక ఆలోచనతో, సమతుల్యమైన పాత్రచిత్రణతో రచనలు చేసే రచయిత్రి లక్ష్మిగారు. ఆమె వ్రాసిన రెండు విభిన్నతరహా కథల సంపుటి ఈ పుస్తకం. ఇందులో ఒక వైపునుంచి చదివితే హాస్యకథలు నవ్విస్తాయి. మరోవైపునుంచి చదివితే వదినగారి కథలు పలకరిస్తాయి. రెండు తరహా కథలనూ కూడా సమానమైన సౌలభ్యంతో వ్రాశారు రచయిత్రి. హాస్యకథల విషయానికి వస్తే - ఈ కథల్లో హాస్యం సన్నివేశపరంగా ఉంటుంది. పాత్రచిత్రణలో ఉంటుంది. కథలో ఒక భాగంగా ఉంటుంది. ఇలాంటి హాస్యాన్ని పండించడానికి చాలా నేర్పుకావాలి. అది ఈ హాస్య కథల్లో పుష్కలంగా కనిపిస్తుంది. 'పాపం ఆత్మారాముడు' కథలో సంచీనిండా కూరగాయలు తీసుకొచ్చిన భార్యను చూసి ఆనందపడ్డ భర్తకి ఎదురైన వాస్తవం మనకీ చిరునవ్వు తెప్పిస్తుంది. పెళ్ళి పీటలమీద కూడా మొబైల్ ఫోన్ అలవాటుని మానలేని వధూవరులకు పురోహితులు చూపించిన పరిష్కారం 'హమ్మ మొబైలా?' కథలో మనల్నీ నవ్విస్తుంది. ఏ హాస్యకథా నిరాశపరచదు, 'ఇంతే కదా' అనిపించదు. ఇవన్నీ కడుపుబ్బ నవ్వించే హాస్యకథలు కాకపోవచ్చుకానీ మనసులో నవ్వుల పువ్వులు పూయించే కథలు అని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. రెండోవైపునుంచి పలకరించే 'వదినగారి కథలు' కూడా మొదటనుంచి చివరంటా చదివించే కథలే.' ఈ వదినగారి కథల్లో వదినగారు ప్రేమమయి, అనురాగమూర్తి. వదినా మరదళ్ళ మధ్యఉండే ఆత్మీయతానురాగాలతో నిండిన సన్నివేశాలు ఈ కథలకు మూలం. చాలా సరళంగా, సులువుగా హాయిగా సాగుతాయీ వదినగారి కథలు. మొత్తం మీద ఈ కథల సంపుటి చదవడం పూర్తికాగానే రచయిత్రి కలంనుంచీ రాబోయే రచనలు తప్పకచదవాలి అన్న భావం కలుగుతుంది. ఈ కథాసంపుటానికి ముందుమాట ప్రముఖ హాస్యరచయిత్రి పొత్తూరి విజయలక్ష్మిగారు వ్రాశారు.

★★★

**Smt.G.S.Lakshmi**
2-2-23/7/1, Bagh Amberpet
Hyderabad -500 013
☎ 040-27425306
990 864 8068
*E-mail:* slalita199@gmail.com




"**అమూర్త భావాలకు** అక్షర రూపాన్నివ్వగలిగే ప్రతిభ శ్రీనివాసరావు సొంతం.. కవులు తాత్వికులు కారు. సాధారణంగా కవిత్వం సౌందర్య ప్రధానం. కానీ తాత్విక స్పర్శ ఉన్న కవిత్వం సత్యానికి సన్నిహితంగా ఉంటుంది. శ్రీనివాసరావు కవి తాత్వికుడు. ఇతడొక జీవన చతన్య సహస్యం తెలిసిన కవి! ఇతడొక మనస్సన్యాసి! జైలులాంటి ప్రపంచంలో ఈ కవి ఒక జెన్‌రుషి' అని కవి ముప్వా(క్రాంతి)శ్రీనివాసరావుగారి గురించి ఈ పుస్తక రచయిత సౌభాగ్యగారు పరిచయవాక్యాల్లో వ్రాశారు. ఆధునిక కవితా ప్రపంచంలో అర్థవంతమైన, ఆలోచింపచేసే వచనకవితలను విరివిగా వ్రాస్తున్న శ్రీనివాసరావుగారిని ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఏ కవిత వ్రాసినా ఒక ప్రయోజనాన్ని ఆశించి ప్రయోగాలు చేస్తున్న శ్రీనివాసరావుగారి కవిత్వం గురించిన సౌభాగ్యగారు చేసిన సమగ్రవిశ్లేషణే ఈ పుస్తకం. కవితా విశ్లేషణలో సౌభాగ్యగారు చేసిన, చేస్తున్న కృషి అనన్య సామాన్యం. అందులో ఒక ప్రత్యేకమైన భాగమే ఈ భ్రమల్లేని భావుకుడు. కవిత్వం చదవడం, ఆసక్తిగా చదవడం, ఆస్వాదించడం, ఆనందించడం, పదిమందితో పంచుకోవడం.. ఇవన్నీ కవితాస్వాదనలో వివిధదశలు. 20-30 పంక్తుల కవిత గురించి రెండు మూడు పేజీల సమగ్ర విశ్లేషణ , అందులోనూ మూలకవితలోని అందానికి, గూఢతకూ ఎక్కడా భంగం వాటిల్లకుండా వ్రాయడం చాలా కష్టం. ఈ ప్రక్రియను అవలీలగా, ఆసక్తికరంగా పాఠకుల ముందుకు తీసుకొచ్చారు సౌభాగ్యగారు. ఈ విశ్లేషణలు చదివాక శ్రీనివాసరావుగారి కవిత్వం పట్ల గౌరవం మరింత పెరుగుతుంది. ఒక కవి కవిత్వం గురించిన విశ్లేషణను కూడా అద్భుతమైన కవితా శైలిలో వ్రాయడం సౌభాగ్యగారి ప్రత్యేకత - అనేది - ఈ పుస్తకం ఆసాంతం చదివాక కలిగే భావన. శ్రీనివాసరావుగారి రెండుకవితా సంపుటాలు సమాంతరచ్ఛాయలు, 6త్ ఎలిమెంట్ నుంచి 33 కవితలు తీసుకుని వాటిని విపులంగా కవితా చక్షువులతో చూపించారు రచయిత. ఒక్కోకవిత గురించి వ్రాసేప్పుడు సౌభాగ్యగారు ఎంచుకున్న శీర్షికలే శ్రీనివాసరావుగారి కవిత్వంలోని వివిధకోణాలను ప్రతిబింబిస్తున్నాయి.'స్వేచ్ఛా రహస్యం తెలిసిన వాడు',' పసివాడుగా మారిన కవి',' అంతరాంతరాల అన్వేషకుడు',' భ్రమలు లేని భావుకుడు',' మనసు మోసాన్ని పసికట్టిన మాంత్రికుడు',' జీవితాన్ని కలగంటున్న మనిషి',' ఆశకు ఆశ కలిగించే కవి' - ఇలాంటి శీర్షికలతో మూలకవితమీద ఆసక్తిని, ఆకర్షణను మరింత పెంచేలా సాగాయి ఇందులోని విశ్లేషణలన్నీ. ఒకరి కవిత్వం గురించి ఇంత హృదయంగమమైన విశ్లేషణ వ్రాయాలంటే రచయితను ఆ కవితలు ఎంతగానో కదిలించి ఉండాలి. తనను కదిలించిన కవితలను గురించిన విశ్లేషణను, పదిమందినీ కదిలించేలా వ్రాయడంలో సౌభాగ్యగారు నూటికి నూరుశాతం విజయం సాధించారు. మూలకవితల రచయిత ముప్వా(క్రాంతి) శ్రీనివాసరావుగారు, ఈ విశ్లేషణా రచయిత సౌభాగ్యగారూ.. ఇద్దరూ అభినందనీయులే!!

★★★

**నవ తెలంగాణా పబ్లిషింగ్ హౌస్**
*ఎంహెచ్ భవన్, ప్లాట్ నెం. 21 / 1,*
*అజామాబాద్, ఆర్.టి.సి కళ్యాణమండపం దగ్గర*
*హైదరాబాద్- 20, ఫోన్: 040-27660013*

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**